

రంజాన్ వేళలు



	ఇఫ్తార్(బుధవారం)	సెహరీ(గురువారం)
కర్నూలు	6:34 (సాయంత్రం)	4:59 (ఉదయం)
ఎమ్మిగనూరు	6:31 (సాయంత్రం)	5:12 (ఉదయం)
ఆదోని	6:36 (సాయంత్రం)	5:01 (ఉదయం)

అడ్డగోలుగా వెంచర్లు

ఎమ్మిగనూరు, మార్చి 19: రియల్ ఎస్టేట్ వ్యాపారులు అడ్డగోలుగా వెంచర్లు వేస్తున్నారు. అధికార పార్టీ అండదండలతో నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారు. ఎమ్మిగనూరు పట్టణంతోపాటు చుట్టు ముట్టు ఉన్న సమీప గ్రామాల్లో అధికార పార్టీ అండదండలతో అక్రమ వెంచర్లు వెలుస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలను పాటించడం లేదని మున్సిపల్, గ్రామ పంచాయతీ అధికారులకు తెలిసినా ఏమాత్రం పట్టించుకోవటం లేదు. అడపా దడపా వెంచర్లలో రాళ్లు తొలగించి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు.. ఆరుకాయలు అన్న చందంగా నడుస్తోంది.



ఎమ్మిగనూరు పట్టణ శివారులోని గుడికల్ పంచాయతీ పరిధిలో ఏర్పాటైన వెంచర్

- నిబంధనలకు తూట్లు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- పట్టించుకోని అధికారులు..
- జోరుగా రియల్ వ్యాపారం

వందల సంఖ్యలో అక్రమ లే అవుట్లు

అధికార పార్టీ నేతల అండదండలతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిబంధనలకు నీళ్లు వదులుతున్నారు. అధికారులు ఎవరైనా అడ్డు చెబితే అధికార బలాన్ని ఉపయోగిస్తున్నారు. లాభాపేక్షతో భూములు కొనుగోలు చేస్తున్నారు. విచ్చలవిడిగా ప్లాట్లు వేసి, అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఎమ్మిగనూరు పట్టణం చుట్టుముట్టు ప్రాంతంలో అక్రమ లే అవుట్లు వందల సంఖ్యలో ఉండగా, అనుమతి పొందిన లే అవుట్లు ఐదారుకు మించి లేవంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

మామూళ్ల మత్తులో అధికారులు..

ఎమ్మిగనూరు ప్రాంతంలో సాగుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారం అధికారులు... పాలకుల కనుసన్నుల్లో జరుగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. పట్టణం, గ్రామాల్లోను అధికార పార్టీ నాయకులే ప్రజాప్రతినిధులు కావటంతో రియల్ వ్యాపారానికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఎకరానికి ఇంత అంటూ ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. పంచాయతీ సర్పంచులకు సైతం రూ.లక్షల్లో మామూళ్లు అందుతున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. దీంతోనే వారు మౌనం వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయినా కూడా మున్సిపల్, గ్రామ పంచాయతీ అధికారులు సైతం పత్రికల్లో అక్రమాలు వెలుగులోకి వచ్చినప్పుడు హడావుడి చేస్తూ వెంచర్లో వేసిన రాళ్లను తొలగించటం.. అటు తరువాత వదిలిపెట్టడం పరిపాటిగా మారింది. భూములు కొనుగోలు చేసిన ప్రజలు రాబోయే రోజుల్లో ఇబ్బందులు ఎదుర్కోక తప్పే పరిస్థితి కనిపించడం లేదు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

అక్రమ లే అవుట్లతో ప్రభుత్వ ఆదాయానికి రూ.లక్షల్లో గండి పడుతోంది. పట్టణ శివారులతో పాటు సమీప గ్రామాలైన గుడికల్లు, కలుగొట్ల, సోగనూరు, ముగతి, హనుమాపురం, తదితర గ్రామాల్లో దాదాపు వంద ఎకరాలకుపైగా భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు పదుల సంఖ్యలో వెంచర్లు వేశారు. అయితే ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుములను ఎగ్గొట్టి ప్రభుత్వానికి రూ.లక్షల్లో గండి కొడుతున్నారు. ఒక్క కలుగొట్ల పంచాయతీ పరిధిలోనే దాదాపు 40 ఎకరాల్లో అక్రమ వెంచర్లు వెలిసినా అడిగే నాథుడే లేడు.



ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల సమీపంలో అనుమతి లేని వెంచర్

నిబంధనలు ఇలా

- భూమి కొన్న వెంటనే ముందుగా ల్యాండ్ కన్వర్షన్ చేసుకోవాలి. ఇందులో భాగంగా భూమి విలువను బట్టి ప్రభుత్వానికి తొమ్మిది శాతం రుసుము చెల్లించాలి.
- కన్వర్షన్ పూర్తైన తరువాత ఆ ధృవీకరణ పత్రంతో లే అవుట్ కోసం మున్సిపాలిటీ లేదా గ్రామ పంచాయతీలో దరఖాస్తు చేసుకోవాలి.
- మున్సిపల్, గ్రామ పంచాయతీ అధికారుల నిబంధనల మేరకు రుసుము చెల్లించి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి.
- లే అవుట్ వేసే స్థలంలో 33 అడుగుల లింకు రోడ్లు, 40 అడుగుల ప్రధాన రోడ్ల కోసం స్థలం కేటాయించాలి.
- లే అవుట్ వేసే స్థలంలో ప్రజా ఉపయోగాల కోసం పది శాతం ఖాళీ స్థలాన్ని వదలాలి.
- అదే స్థలంలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, గ్రీనరి వంటి ఏర్పాటు చేయాలి.
- అటు తరువాతే స్థలంలో వేసిన ప్లాట్లను విక్రయించాలి.



పట్టణ శివారులో అనుమతి లేకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఏర్పాటు చేసిన వెంచర్



ఎమ్మిగనూరు పట్టణం, కలుగొట్ల మధ్య ప్లాట్లు వేసి విక్రయించేందుకు సిద్ధం చేసిన స్థలం

నోటీసులు జారీ చేసి.. చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వెంచర్లు వేస్తే నోటీసులు జారీ చేస్తాం. అంతేగాక జరిమానాలు విధిస్తాం. ప్రజలు స్థలాలు కొనే ముందు అన్ని అనుమతులు సక్రమంగా ఉంటే కొనుగోలు చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా అక్రమంగా వేసిన స్థలాలను కొనుగోలు చేసి నష్టపోవద్దన్నారు.

- శేషారెడ్డి, తహసీల్దార్, ఎమ్మిగనూరు

ఎన్నికల నియమావళి పక్కాగా అమలు కావాలి

అధికారులను ఆదేశించిన రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 19: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థల ప్రాంగణాల్లోని వాణిజ్య స్థలాల్లో ఎటువంటి రాజకీయ ప్రకటనలు, హోర్డింగులు, పోస్టర్లు, బ్యానర్లను అనుమతించవద్దని జిల్లా ఎన్నికల అధికారిని ఆదేశించారు. హైవేలు, మెయిన్ రోడ్ల పక్కనున్న హోర్డింగులను కూడా సమాన ప్రాతిపదికన అన్ని రాజకీయ పార్టీలకు కేటాయించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున నూతన అనుమతులు ఇవ్వద్దని సూచించారు. వ్యక్తుల ఇళ్ల లేదా భవనాలపై పెద్ద హోర్డింగులకు ముందస్తు అనుమతి తీసుకోవాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్రిష్ణగిరిలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడకండి

క్రిష్ణగిరి, మార్చి 19: ఎలాంటి అల్లర్లకు పాల్పడకుండా ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్ అన్నారు. మంగళవారం సమస్యాత్మక గ్రామాలైన ఆలంకొండ, కటారుకొండ గ్రామాలలో వారు పర్యటించారు. ఓటర్లకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామలక్ష్మి, తహసీల్దార్ అనూరాధ, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీవో రాబర్ట్ విల్సన్, వీఆర్వో వెంకటేశ్వర్లు ఉన్నారు.

వలంటీర్లపై వేటు

- వైసీపీ కోసం ఎన్నికల ప్రచారం
- ఏడుగురిని తొలగించిన గోనెగండ్ల ఎంపీడీవో

గోనెగండ్ల, మార్చి 19: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ప్రతీ అంశాన్ని సీరియస్‌గా తీసుకుంటోంది. ఎన్నికల నియమావళి ఉల్లంఘన ఎక్కడ జరిగినా వారిపై చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల గోనెగండ్ల మండలంలో వైసీపీ అభ్యర్థులను గెలిపించాలంటూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లపై అధికారులు వేటు వేశారు. మండలంలోని వేముగోడు గ్రామంలో ఏడుగురు గ్రామ వలంటీర్లు ఆదివారం వైసీపీ అభ్యర్థులను గెలిపించాలంటూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వీటిపై రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ సాయి వెంకటనాథ్, గ్రామానికి చెందిన హంపన్నలు సాక్ష్యాధారాలతో ఫిర్యాదు చేశారు. దీంతో ఎన్నికల అధికారులు సోనీబాయి, నాగేష్ వేముగోడు గ్రామానికి మంగళవారం వెళ్లి విచారణ చేపట్టారు. వైసీపీ చేపట్టిన 'నేను సిద్ధం నా వార్డు సిద్ధం' అనే కార్యక్రమంలో వలంటీర్లు ఎం.బాలకృష్ణరెడ్డి(11390595003), ఎస్.బాకరబీ (11390595007), పి.అపర్ణ (11390595008), ఎస్.కామాక్షి (11390595010), డి.పుష్పావతి (11390595011), పి.లక్ష్మన్న (11390595014), కె.మద్దిలేటి (1139055015)లు హాజరైనట్లు అధికారులు నిర్ధారించారు. ఎన్నికల సంఘానికి నివేదిక పంపిన అనంతరం వారిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఎంపీడీఓ సోనీబాయి వెల్లడించారు. మండలంలో ఇప్పటికి రెండు గ్రామాలలో ఎన్నికల ఉల్లఘన జరిగిన సంఘటనలు జరిగాయి.



గోనెగండ్ల మండలం వేముగోడులో ఈనెల 17న వైసీపీ నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లు

6 నుంచి శ్రీశైలంలో ఉగాది ఉత్సవాలు

ఏర్పాట్లపై అధికారుల సమావేశం



మాట్లాడుతున్న ఈఓ పెద్దిరాజు, పాల్గొన్న అధికారులు

శ్రీశైలం, మార్చి 19: శ్రీశైల మహాక్షేత్రంలో ఏప్రిల్ 6 నుంచి 10 వరకు ఐదురోజులపాటు ఉగాది మహోత్సవాలను దేవస్థానం ఘనంగా నిర్వహించనుంది. ఈ సందర్భంగా మంగళవారం ఆలయ కార్యనిర్వహ ణాధికారి డి.పెద్దిరాజు కార్యాలయ భవనంలోని సమావేశ మందిరంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆలయ అన్ని విభాగాధిపతులు, పర్యవేక్షకులు, ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈఓ పెద్దిరాజు మాట్లాడుతూ ఉగాది మహోత్సవాలకు కర్ణాటక రాష్ట్రం నుంచే కాకుండా మహారాష్ట్ర, తదితర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా కాలిబాట మార్గంలో వెంకటాపురం, నాగలూటి, దామెర్లకుంట, పెద్దచెరువు, మఠం బావి, భీముని కొలను, కైలాసద్వారం ప్రాంతాల్లో సదుపాయాల కల్పనకు లోటులేకుండా చూడాలన్నారు. ఉత్సవాలలో స్వామి, అమ్మవార్ల కైంకర్యాలన్నీ సంపూర్ణంగా జరిపించేందుకు అవసరమైన ప్రణాళికలతో చర్యలు తీసుకోవాలని సూచించారు. క్యూలైన్లలో వేచివున్న భక్తులకు నిరంతరం మంచినీరు, అల్పాహారం అందజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రపరిధిలోని ఆరుబయలు ప్రదేశాలు, పార్కింగ్ తదితర ప్రదేశాలలో భక్తులు సేదతీరేందుకు చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ గుర్రప్ప, శ్రీశైలం సీఐ రమేష్‌కుమార్, ఎస్ఐలు లక్ష్మణరావు, గంగయ్యయాదవ్, అగ్నిమాపక స్టేషన్ ఆఫీసర్ అయూబ్‌ఖాన్, మండల ప్రాథమిక వైద్యురాలు శ్రీవాణి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

శేష వాహనంపై జ్వాలా నరసింహస్వామి

నంద్యాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అహోబిలం శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎగువ అహోబిలంలో ఐదో రోజు మంగళవారం జ్వాలా నరసింహస్వామి శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం రాత్రి స్వామి వారు చంద్రప్రభ వాహనంపై విహరించారు. అదేవిధంగా దిగువ అహోబిలంలో లక్ష్మీనారసింహుడు గరుడవాహనంపై భక్తులకు దర్శనమివ్వగా రాత్రి హనుమంతవాహనంపై తిరువీధుల్లో విహరించారు. శ్రీవారి ఉత్సవా లను తిలకించేందుకు జిల్లా నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఇదిలా ఉండగా అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి వారిని మహారాష్ట్ర ఫారెస్ట్ ప్రిన్సిపల్ కార్యదర్శి వేణు గోపాలరెడ్డి, మలేషియా ఐఎఫ్ఎస్ నాగభూషణరెడ్డి మంగళవారం దర్శించుకు న్నారు. వీరికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పీఠాధిపతి రంగనాథయతీంద్ర మహాదేశికన్‌ను కలిసి ఆశీర్వచనాలు తీసుకున్నారు. వీరి వెంట ఫారెస్టు అధికారులు శ్రీపతినాయుడు, సిబ్బంది ఉన్నారు.



దిగువ అహోబిలంలో విహరిస్తున్న ప్రహ్లాదవరదస్వామి

ఓటర్ల చేతిలో పాశుపతాస్త్రం



సీ విజిల్

- ఎన్నికల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ఈసీ కొత్త ప్రయోగం
- గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో యాప్
- ఆడియో, వీడియో, ఫొటోల ద్వారా ఫిర్యాదు చేసే వెసులుబాటు
- ఫిర్యాదు చేసిన ఐదు నిమిషాల్లోనే స్పందన
- వంద నిమిషాల్లోనే చర్యలు

కర్నూలు కలెక్టరేట్/నంద్యాల (నూనెపల్లె) మార్చి 19: రాష్ట్ర ప్రజల భవిష్యత్తును దిశ, నిర్దేశం చేసే సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) అమలులోకి వచ్చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఈ ఎన్నికలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా మారాయి. అక్రమాలకు, నిబంధనల ఉల్లఘనలకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎలాగైనా గెలవాలని దురుద్దేశంతో అధికారాన్ని అడ్డం పెట్టుకొని రెచ్చిపోయే అవకాశాలు లేకపోలేదు. ఎన్నికల నిబంధనలను సైతం తుంగలో తొక్కేవాళ్ళు లేకపోలేదు. ఏ రాష్ట్రంలో లేని విధంగా వలంటీర్ల వ్యవస్థ అధికార పార్టీ కన్ను సన్నల్లో పని చేసేందుకు సిద్ధమవుతోంది. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసింది. ఇందులో పౌరులను సైతం భాగస్వామ్యం చేసింది. సీ విజిల్ యాప్ ద్వారా ఈ అవకాశం కల్పించింది. నిబంధనలు ఉల్లంఘించేవారిని పట్టించేందుకు సీ విజిల్ ఎంతగానో దోహదం చేయనున్నది.

ఎలాంటి అక్రమాలు జరగకుండా సార్వత్రిక ఎన్నికలను సాఫీగా నిర్వహించడానికి కేంద్ర ఎన్నికల సంఘం పటిష్ట చర్యలను చేపడుతోంది. అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు అవసరమయ్యే అన్ని రకాల వనరులను ఈసీ వాడుకుంటోంది. అందులో భాగంగానే తీసుకొచ్చిన 'సీ విజిల్' యాప్ ద్వారా సామాన్య ప్రజలను కూడా భాగస్వామ్యం చేసింది. ఎన్నికల సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన నాయకుల పని పట్టేందుకు దీనిని పాశుపతాస్త్రంగా ఉపయోగించుకోవచ్చు.

సీ విజిల్ అంటే ఏమిటి



ఎన్నికల ప్రవర్తనా నియమావలి అమలులోకి వచ్చిన నాటి నుంచి ఈ సీ విజల్ యాప్ అందులోబాటులోకి వచ్చింది. ఎన్నికల ఉల్లంఘనలపై సాక్షాలతో సహా అందులో పొందుపరచవచ్చు. ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రూపంలో రికార్డు చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫిర్యాదు చేసిన ఐదు నిమిషాల్లో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగుతారు. దీనిపై విచారణ చేపట్టి 100 నిమిషాల్లో సదరు ఫిర్యాదుపై ఖచ్చితమైన చర్యలు తీసుకుంటారు. దీన్ని ప్రజలు ఎవరైనా వినియోగించుకోవచ్చు. పార్టీలకు అతీతంగా ఎవరు అవినీతికి పాల్పడినా ఈ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

ఐదు నిమిషాల్లోనే రంగంలోకి...



యాప్‌లో వివరాలు పొందుపరచగానే జిల్లా ఎన్నికల అధికారి ఐదు నిమిషాల్లో దాన్ని ఫీల్డ్ యూనిట్‌కు పంపిస్తారు. వారు 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేసుకుంటారు. విచారించి 30 నిమిషాల్లో వివరాలు సేకరిస్తారు. అనంతరం ఎన్నికల అధికారికి నివేదిస్తారు. ఆయన దానిపై 50 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. ఇలా 100 నిమిషాల్లో సీ విజిల్ యాప్‌లో చేసిన ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటారు. మీరు చేసిన ఫిర్యాదు స్టేటస్ కూడా తెలుసుకునే వెసులుబాటు ఉంది.


రిజిస్ట్రేషన్ చేసుకోవడమెలా?

ముందుగా సెల్‌ఫోన్‌లోని గూగుల్ ప్లే స్టోర్‌లో కేంద్ర ఎన్నికల సంఘం వారు సీ విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. సెల్‌ఫోన్ నంబరు ద్వారా దానిలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. వచ్చిన ఓటీపీని ఎంటర్ చేసుకుంటే సీ విజిల్ యాప్ సిద్ధమైనట్లే. దాని ద్వారా ప్రజలు ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు.

ఎలాంటి ఫిర్యాదులు చేయాలంటే...

ఎన్నికల ప్రవర్తన నియమావళికి భిన్నంగా ఉన్న దేనిపైన అయినా ఫిర్యాదు చేయవచ్చు. డబ్బు పంపకాలు, ఉచితాలు, బహుమతుల అందజేత, రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, మద్యం, మత్తు పదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాలలో తరలించడం, ఇలాంటి ఉల్లంఘనలను ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రికార్డు చేసి అప్‌లోడ్ చేయాలి.

ఎలా ఫిర్యాదు చేయాలి..



యాప్ తెరవగానే స్క్రీన్‌పై ఫొటో, వీడియో, ఆడియో అనే మూడు ఆప్షన్లు ఉంటాయి. ఫొటో ద్వారా ఫిర్యాదు చేయాలనుకుంటే ఫొటో ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. మీ లొకేషన్ నమోదవుతుంది. ఉల్లంఘనకు సంబంధించిన ఫొటోను అప్‌లోడ్ చేయాలి. ఏ రాష్ట్రం, ఏ నియోజకవర్గం, తదితర వివరాలను నమోదు చేయాలి. సదరు ఉల్లంఘనను క్లుప్తంగా వివరించాలి. ఎన్నికల సంఘానికి చేరుతుంది. ఇది ఎన్నికల సంఘానికి చేరుతుంది. యాప్‌లో వివరాలు పొందుపరచగానే జిల్లా ఎన్నికల అధికారి సంబంధిత విషయంపై విచారణజరుపుతారు. సీ-విజిల్ యాప్‌లో చేసిన ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటారు. ఇక్కడ ఫిర్యాదు స్టేటస్ కూడా తెలుసుకునే వెసులుబాటు ఉంది. ఎక్కడైనా ఎన్నికల ఉల్లంఘనలు కనిపిస్తే ఎవరైనా సీ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.



అడ్డుకట్ట వేసేందుకే 'సీ విజిల్'

తాయిలాలు పంచి అక్రమాలకు పాల్పడి అధికార పీఠం ఎక్కాలనుకునే అరాచక రాజకీయ పార్టీలకు ఈ యాప్ ద్వారా చరమగీతం పాడవచ్చు. బాధ్యత గల పౌరుడిగా యాప్ డౌన్‌లోడ్ చేసుకొని ఎక్కడైనా ఎన్నికల ఉల్లంఘన కనిపిస్తే ఫిర్యాదు చేసేందుకు ఈ యాప్‌ను కేంద్ర ఎన్నికల సంఘం అందుబాటులోకి తీసుకొచ్చింది. అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు, రాజ్యాంగ బద్దంగా ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికలు జరిగేందుకు పౌరుడిగా మనవంతు బాధ్యతను నిర్వర్తించేందుకు ఈ యాప్ దోహదం చేస్తుంది.

కాంగ్రెస్‌లో చేరిన వైసీపీ ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్



ఏపీసీసీ ఛీఫ్ వైఎస్ షర్మిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన వైసీపీ ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్

నందికొట్కూరు, మార్చి 19: ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వకపోవడంతో అన్న జగన్మోహన్‌రెడ్డిని వదిలి చెల్లెలు షర్మిల చెంతకు చేరారు నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్. వైసీపీపై అసంతృప్తిగా ఉన్న నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ మంగళవారం విజయవాడలో ఏపీసీసీ ఛీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఆయనతోపాటు కౌన్సిలర్ ధర్మారెడ్డి, మరికొందరు కాంగ్రెస్ కండువాను కప్పుకున్నారు. దీంతో ఈ ఎన్నికల్లో వైసీపీకి నియోజకవర్గంలో గట్టి షాక్ తగలనుంది. వైసీపీకి కంచుకోటగా ఉన్న మాల సామాజిక వర్గం ఓట్లు కాంగ్రెస్ వైపు వెళ్లే అవకాశకం కనిపిస్తోంది.

గ్రావెల్ తవ్వితే చర్యలు



అక్రమ తవ్వకాల్లో సీజ్ చేసిన టిప్పర్లు

కర్నూలు(అర్బన్), మార్చి 19: అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని గనుల శాఖ డిప్యూటి డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. మంగళవారం కర్నూలు రూరల్ మండలం ఎదురూరు గ్రామ పొలిమేరలో సర్వే నంబర్ 156లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు నిర్వహించి, రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

యాగంటిలో పుష్ప-2 సినిమా షూటింగ్



యాగంటి వెంకటేశ్వరగవి వద్ద చిత్రీకరిస్తున్న దృశ్యాలు

బనగానపల్లె, మార్చి 19: ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలోని శ్రీవెంకటేశ్వర గవి వద్ద పుష్ప-2 సినిమా షూటింగ్ మంగళవారం జరిగింది. పుష్ప మూవీకి సీక్వెల్‌గా పుష్ప-2 సినిమా రూపొందుతోంది. ఈ సినిమా వివిధ ప్రాంతాల్లో చిత్రీకరిస్తున్నారు. మైత్రి మూవీస్ మేకర్స్ బ్యానర్‌లో సుకుమార్ దర్శకత్వంలో వెంకటేశ్వర గవి వద్ద పలు సన్నివేశాలు చిత్రీకరించారు. హీరో అల్లు అర్జున్ వివాహ సన్నివేశానికి కొనసాగింపుగా ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాలను హీరోయిన్ రష్మిక, నటి రమ్యకృష్ణ, క్యారక్టర్ నటుడు అజయ్ తదితరులతో చిత్రీకరించారు. బుధవారం కూడా షూటింగ్ కొనసాగనుంది.

ఆస్పత్రిలో ఎలుకల బెడద

- హెచ్‌వోడీల ఫిర్యాదు
- కొత్త వెబ్‌సైట్ ప్రారంభం



మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), మార్చి 19: సర్వజన వైద్యశాలలో ఎలుకల బెడద అధికమైందని, వార్డుల్లోకి వస్తున్నాయని కొందరు హెచ్‌వోడీలు సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ధన్వంతరీ హాలులో ఆరోగ్యశ్రీ ఈ-హాస్పిటళ్లపై హెచ్‌వోడీలతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వి. వెంకటరంగారెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎలుకలు, దోమలు, బొద్దింకల నివారణ కోసం పెస్ట్ కంట్రోల్ ఏజెన్సీకి నెలకు రూ.5.30 లక్షలు నిధులు వెచ్చిస్తున్నామని, ఎలుకలు ఉంటే వైద్యులు, నర్సింగ్ సిబ్బంది ఏజెన్సీకి తెలిపి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ఇంతలో కొందరు వైద్యులు ఎలుకలను నియంత్రించాలని కోరారు. రోగుల సహాయకులు కొన్ని వార్డుల్లో భోజనాలు చేస్తూ మిగిలిన ఆహార పదార్థాలను అక్కడే పడేస్తున్నారని, దీనివల్ల ఎలుకలు సంచారం ఎక్కువైందని అన్నారు. ఆసుపత్రికి ఒక కొత్త వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. అన్ని విభాగాల సమాచారాన్ని వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు చెప్పారు. ఈ వెబ్‌సైట్ కోసం వివిధ విభాగాధిపతులు సలహాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ హరిచరణ్, ఆసుపత్రి సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, ఆర్ఎంవో వెంకటరమణ, హెచ్‌వోడీలు, వైద్యులు పాల్గొన్నారు.

బుగ్గనకు రూ.వేల కోట్లు ఎలా వచ్చాయి?

- మంత్రి కాకముందు ఆస్తులెంత?
- సీఎం జగన్, మంత్రి బుగ్గన ఇద్దరూ దొంగలే..
- ప్రజల గొంతులు కోసి రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచారు..
- జీవితాంతం జగన్ జైల్లో ఉండాల్సిందే..
- డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



సీసంగుంతలలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, మార్చి 19: ఆర్థిక మంత్రి కాకముందు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆస్తులెంత..? ఇప్పుడు ఆయన ఆస్తులు వేల కోట్లకు ఎలా చేరాయని మాజీ కేంద్ర మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. మంగళవారం డోన్ మండలంలోని సీసంగుంతల, యు.కొత్తపల్లి గ్రామాల్లో కోట్ల తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ నాలుగు గోడల మధ్య కూర్చుని మంత్రి బుగ్గన ఏదేదో మాట్లాడుతున్నారని, మా కుటుంబానికి బుగ్గన అసలు సమవుజ్జి కానే కాదని అన్నారు. తన తండ్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి రెండుసార్లు ముఖ్యమంత్రిగా పని చేశారని, తాను కేంద్ర మంత్రిగా పని చేశానని, 70ఏళ్ల క్రితం మా ఆస్తులు ఎంత ఉన్నాయో.. ఇప్పుడు అంతే ఉన్నాయన్నారు. బుగ్గన మంత్రి కాకమునుపు ఎన్ని ఆస్తులు ఉన్నాయి.. ఐదేళ్లలో మంత్రి పదవిని అడ్డం పెట్టుకుని అక్రమంగా సంపాదించిన ఆస్తుల విలువెంతో ప్రజల ముందు పెట్టే ధైర్యముందా అని సవాల్ విసిరారు. సీఎం జగన్, మంత్రి బుగ్గన ఇద్దరూ దొంగలేనని, ప్రజల గొంతులు కోసి రాష్ట్రాన్ని దోచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచడం, ప్రజలను దోపిడీ చేయడం అభివృద్ధి అవుతుందా అని ప్రశ్నించారు. కేంద్రం ఇచ్చిన నిధులతో రోడ్లు, ఆసుపత్రి, బడులు కట్టి తానేదో చేసినట్లు మంత్రి బుగ్గన ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. గ్రామాల్లో కోట్ల, కేఈ కుటుంబాలు చేసిన అభివృద్ధే కనిపిస్తుందని, బుగ్గన చేసిన అభివృద్ధి ఏమిటో చూపించాలన్నారు. డోన్ నియోజకవర్గంలో కరువు వచ్చి రైతులు నష్టపోతే.. ఆర్థిక మంత్రిగా ఉండి కూడా డోన్, ప్యాపిలి మండలాలను ఎందుకు కరువు మండలాలుగా ప్రకటించలేదని నిలదీశారు. మంత్రి బుగ్గన చెప్పే మోసపు మాటలను డోన్ నియోజకవర్గ ప్రజలు ఇక నమ్మే పరిస్థితి లేదని, టీడీపీని తప్పనిసరిగా ప్రజలు గెలిపించడం ఖాయమని ఉద్ఘాటించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, వలసల రామక్రిష్ణ, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ టీఈ కేశన్నగౌడు, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ లక్ష్మిరెడ్డి, ఓబులాపురం శేషిరెడ్డి, మల్లిరమణ, శ్రీనివాస భట్, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, భాస్కర్ నాయుడు, రాంబాబు రెడ్డి, రంజిత్ కిరణ్, దేవరబండ వెంకటనారాయణ, చంద్రపల్లి ఆచారి, అన్వర్‌బాషా, ఎస్ఎండీ రఫీ, మిద్దెపల్లి గోవిందు, సీసంగుంతల శివ నాగిరెడ్డి, గోవిందు, మాజీ ఎంపీటీసీ గౌరమ్మ, బీజీపి నాయకులు వడ్డె మహారాజ్, ఆర్మీ రామయ్య, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి, బ్రహ్మం పాల్గొన్నారు

రెండో రోజు పది పరీక్షలు ప్రశాంతం

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 19: జిల్లాలో మంగళవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ తెలిపారు. పరీక్షలకు 31,637 మంది నమోదు చేసుకోగా.. 30,807 మంది పరీక్షకు హాజరు కాగా, 560 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. జిల్లా పరిశీలకుల అధికారి గీత, డీఈఓ, ఇతర అధికారులు సెంటర్లను తనిఖీ చేశారు. ఇదిలా ఉండగా ఒక మాల్ ప్రాక్టీసు కేసు నమోదైనట్లు తెలిపారు.

రేడియో థెరపీ టెక్నీషియన్ పోస్టుల కౌన్సిలింగ్ వాయిదా

కర్నూలు(హాస్పిటల్), మార్చి 19: స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌కు సంబంధించిన రేడియో థెరపీ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి ఈ నెల 20న నిర్వహించాల్సిన కౌన్సిలింగ్ వాయిదా వేసినట్లు కర్నూలు మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హరిచరణ్ ఓ ప్రకటనలో తెలిపారు. మెరిట్ లిస్టు, సెలక్షన్ లిస్టు సరి చేశాక కౌన్సిలింగ్ తేదీని వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

సీఎం బొమ్మ అవుట్..!

- ఎట్టకేలకు ఓపీ చీటీలో తొలగించిన అధికారులు
- మంత్రులు, ఎమ్మెల్యే ఫొటోలు సైతం..



సీఎం జగన్ బొమ్మ కనపడకుండా పేపర్‌ను అతికించిన సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్), మార్చి 19: కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై అధికారులు అప్రమత్తమయ్యారు. సీఎం జగన్, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేల ఫొటోలు కనపడకుండా చర్యలు తీసుకున్నారు. ఈ నెల 18వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'కోడ్ ఉల్లంఘన' కథనానికి అధికారులు స్పందించారు. ఓపీ చీటిల్లో ఉన్న ముఖ్యమంత్రి బొమ్మను తొలగించారు. అలాగే ఫ్లెక్సీల్లో కూడా సీఎంతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేల ఫొటోలు ఎక్కడా కనిపించకుండా పేపర్లను అతికించారు.



ఓపీ వివరాలు అందించే హోర్డింగ్‌పై సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల ఫొటోలను పేపర్లతో కప్పేశారు



మందులు ఇచ్చే కేంద్రంలో ఫ్లెక్సీపై పేపర్‌ను అతికించిన సిబ్బంది



ఓపీ కౌంటరు నెంబరు-10 గదికి పేపర్లను అతికిస్తున్న సిబ్బంది

రాజకీయ నాయకుల ఫొటోలను తొలగించాలి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

కోడుమూరు, మార్చి 19: ఎన్నికల కోడ్ దృష్టిలో ఉంచుకొని రాజకీయ నాయకులు, మంత్రులకు సంబంధించిన ఫొటోలు, పోస్టర్లను తొలగించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. స్థానిక అయుష్మాన్ ఆరోగ్య మందిర్ కేంద్రాన్ని ఆయన మంగళ వారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున వైద్య, ఆరోగ్య శాఖకు సంబంధించిన అన్ని కార్యాలయాల్లో మంత్రుల ఫొటోలను తొలగించాలన్నారు. ఫొటోలను తొలగించినట్లు ధృవీకరణ పత్రాలను జిల్లా కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని లద్దగిరి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రలో ప్రసవాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రంలో మందులు, ల్యాబ్, వార్డు గదులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట వైద్యాధికారులు భాస్కర్, జయంతి, సీహెచ్‌వో శాంత, ఎంపీహెచ్‌ఈవో నరసప్ప ఉన్నారు.

ఆటోలపై పార్టీల స్టిక్కర్లు, ఫ్లెక్సీలు తొలగించాలి



మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్

కర్నూలు(న్యూసిటీ), మార్చి 19: నగరంలో తిరిగే ఆటోలపై ఉన్న రాజకీయ పార్టీలకు సంబంధించిన స్టిక్కర్లు, ఫ్లెక్సీలను తొలగించాలని నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ సూచించారు. మంగళవారం కార్యాలయంలోని పాతకౌన్సిల్ హాలులో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా రామలింగేశ్వర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున డ్రైవర్లు తమ ఆటోలపైన, లోపల భాగంలో రాజకీయ పార్టీల బ్యానర్లు, స్టిక్కర్లు, పోస్టర్లు అతికించరాదని అన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లం ఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీసీపీ సంధ్య, ఏసీపీ రంగస్వామి, ఎన్నికల ప్రవర్తనా నియమావళి నోడల్ అధికారి శశికళ, ట్రాఫిక్ ఎస్‌ఐ వహిద్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాల వద్ద డీఎస్పీ విజయశేఖర్

సి.బెళగల్, మార్చి 19: మండల కేంద్రమైన సి.బెళగల్, పోలకల్లు, గొల్లలదొడ్డి, కంబందహాల్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. గ్రామాల్లో సమస్యలు ఏమైనా ఉంటే తమ దృషికి తీసుకురావాలన్నారు. డీఎస్పీ వెంట కోడు మూరు సీఐ మన్సురుద్దీన్, సి.బెళగల్ ఎస్‌ఐ తిమ్మారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

నేడు ఉయ్యాలవాడకు బైరెడ్డి శబరి రాక

ఓర్వకల్లు, మార్చి 19: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామానికి బుధవారం టీడీపీ నాయకురాలు బైరెడ్డి శబరి రానున్నట్లు టీడీపీ నాయకులు మంగళవారం తెలిపారు. బైరెడ్డి శబరి టీడీపీలో చేరిన నేపథ్యంలో తొలిసారిగా ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ గ్రామానికి రానున్న సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. శబరి టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

కర్నూలు(న్యూసిటీ), మార్చి 19: నగర పాలక సంస్థ పరిధిలో 500 ఎంఎం పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టడం వల్ల 26, 27, 33, 35, 42 వార్డులకు రెండు రోజుల పాటు తాగు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని కమిషనర్ ఎ.భార్గవతేజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21, 22 తేదీలలో పాతకల్లూరు, క్రిష్ణానగర్, ఆదిత్యనగర్, కొత్తబస్టాండు, జంపల శివయ్యనగర్, తిలక్‌నగర్, చల్లావారి వీధి తదితర ప్రాంతాలలో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

జగన్ పాలనలో రాష్ట్రం అప్పులపాలు

» మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, మార్చి 19: సీఎం జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అప్పులపాలైందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి గౌరు చరిత అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 19వ వార్డు హౌసింగ్‌బోర్డు కాలనీలో ఆమె శంఖారావం, సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న వైసీపీని ప్రజలు తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలపై అన్నిరకాల చార్జీలు, పన్నులు పెంచి భారం వేశారని ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో వైసీపీ కనుమరుగు కావడం తథ్యమన్నారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం టీడీపీ అధినేత చంద్రబాబు బీజేపీ, జనసేన పార్టీలతో పొత్తు పెట్టుకున్నారన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి రావడానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి ప్రభాకర్ యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పల్లె రఘునాథ్‌రెడ్డి, వంగాల జనార్దన్ రెడ్డి, విద్యార్థి విభాగం జేఏసీ చైర్మన్ శ్రీరాములు, అయ్యస్వామి, రమేష్ యాదవ్, పాండు, మౌలాలి, గంగులు పాల్గొన్నారు.



టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందజేస్తున్న గౌరు చరిత

రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించండి: జేసీ

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 19: ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని పాణ్యం నియోజకవర్గ ఈఆర్వో, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య కోరారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సాధారణ ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై రాజకీయ పార్టీ ప్రతినిధులు, సంబంధిత అధికారులతో జేసీ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా జేసీ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేసే అభ్యర్థి రూ.40లక్షలు మించి ఖర్చు చేయరాదన్నారు. అభ్య ర్థులు ప్రచార నిమిత్తం వినియోగించే బ్యానర్లు, జెండాలు, టోపీలు, యాడ్స్‌కు సంబంధించి రేటింగ్ కార్డు ఇస్తామన్నారు. రేటింగ్ కార్డు ప్రకారమే ప్రచారాలు నిర్వహించుకోవాలన్నారు. పార్టీల అభ్యర్థులు సభలు, సమావేశాలు నిర్వహించుకోవాలనుకుంటే 48 గంటల ముందే అనుమతి తీసుకుని సభలు నిర్వహించుకోవాలన్నారు. ఎంసీఎంసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో వ్యూయింగ్ టీంలు నియో జకవర్గంలో పర్యవేక్షిస్తుంటారన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో అనుమతి కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలనే దానిపై పీపీటీ ద్వారా రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేశారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ నియోజకవర్గంలో కొన్ని ప్రాంతాల్లో ఎన్నికల కోడ్ ప్రారంభమైనా ఇంకా కొం త మంది రాజకీయ నాయకుల ఫొటోలు అలాగానే ఉన్నాయన్నారు. జేసీ స్పందిస్తూ అటువంటివి ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే తక్షణమే వాటిని తొలగిస్తామన్నారు. ఈ సమావేశంలో ఓర్వకల్లు, పాణ్యం, గడివేముల తహసీల్దార్లు నటరాజ్, ఫణికుమార్, జమనుల్లా ఖాన్, టీడీపీ, వైసీపీ, సీపీఎం, బీఎస్పీ తరపున ప్రశాంత్ రెడ్డి, సురేష్, రామక్రిష్ణ, చిరంజీవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ మౌర్య

చంద్రబాబుతోనే రాష్ట్రం సుభిక్షం

» కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి



ప్రజలకు సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తున్న దస్తగిరి

కోడుమూరు(రూరల్), మార్చి 19: మాజీ సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్త గిరి అన్నారు. మండలంలోని అమడగుంట్ల గ్రామంలో మంగళవారం రాత్రి బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో నిత్యావసర ధరలు పెరిగిపోయాయని, రైతులకు గిట్టుబాటు ధరలు లేవ ని అన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌ను ఇంటికి సాగనంపుదామని పిలుపునిచ్చారు. సర్పంచ్ వరలక్ష్మీ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో నిధులు లేక ఎలాంటి అభి వృద్ధి జరగలేదన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే గ్రామాలు అభివృద్ధి బాట పయనిస్తాయన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కవితమ్మ, నాయకులు తులసీరెడ్డి, సాగర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శంకరరెడ్డి, రమేష్, సురేష్, మధునాయుడు, రవికిషోర్ పాల్గొన్నారు.

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ

కర్నూలు(కల్చరల్), మార్చి 19: నగరంలోని వేంకట అన్నమాచార్య సేవా ట్రస్టు ఆధ్వర్యంలో కొత్త బస్టాండులోని 10వ నెంబరు ప్లాట్‌ఫామ్ వద్ద మంగళవారం ప్రయాణికులకు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేసినట్లు ట్రస్ట్ కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. జి.వెంకటరమణ సహకారంతో వేసవిలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు ఈ చలివేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు విశ్వనాథం, నారాయణ పాల్గొన్నారు.

భజరంగ్ దళ్‌లో చేరిక



భజరంగ్ దళ్‌లో చేరిన వారితో వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు సాయిరెడ్డి

కర్నూలు(కల్చరల్), మార్చి 19: విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) షష్ఠ్యబ్ది ఉత్సవాల సందర్భంగా నగర వీహెచ్‌పీ విభాగమైన బజరంగ్ దళ్‌లో వంద మంది యువకులు చేరారు. మంగళవారం నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని వీహెచ్‌పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి యువకులకు కండువాలు వేసి బజరంగ్ దళ్‌లోకి ఆహ్వానించారు. నగరంలోని వెంకటరమణ కాలనీ సబ్ డివిజన్ ఎన్టీయార్ నగర్ పరిధిలోని యువకులు కోట్ల తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో దేశం, ధర్మం కోసం వీహెచ్‌పీలో చేరుతున్నట్లు ఈ సందర్భంగా సాయిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, కార్యదర్శి మాళిగి భానుప్రకాశ్, బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ టి.ప్రతాపరెడ్డి, వీహెచ్‌పీ నగర అధ్యక్షుడు టీసీ మద్దిలేటి, నగర కార్యదర్శి ఈపూరి నాగరాజు, వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ నాయకులు మహేష్, పీపీ గురుమూర్తి, భగీరథ, కరణం సుధాకర్ పాల్గొన్నారు.

ఆటో రివర్సు పోటీలు ప్రారంభం

ఓర్వకల్లు, మార్చి 19: మండలంలోని యాగంటీశ్వరస్వామి బ్రహోత్సవాల సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటో రివర్సు పోటీలను మంగళవారం సర్పంచు మధు కేశన్న, సీఐటీయూ నాయకుడు శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి పోటీలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. ఈ పోటీల్లో మొదటి విజేత లొద్దిపల్లె గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్లు ఇస్మాయిల్‌కు రూ.5,016, రెండో విజేత సుధాకర్‌కు రూ.3,016, మూడో విజేత నవీన్‌కు రూ.2,016 బహుమతులను దాతలు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ ఆటో యూనియన్ నాయకులు గోరంట్ల, జగదీశ్వర గౌడు, నారాయణ, శేఖర్‌గౌడు, నాగన్న, వీరయ్య పాల్గొన్నారు.

వంద శాతం గ్రాస్ వేతనం ఇవ్వాలి

కర్నూలు(హాస్పిటల్), మార్చి 19: జిల్లాలోని కాంట్రాక్టు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టు, స్టాఫ్ నర్సులకు వంద శాతం గ్రాస్ వేతనం ఇవ్వాలని డీఎంహెచ్‌వో వై.ప్రవీణ్ కుమార్‌కు ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో కాంట్రాక్టు ఎల్‌టీలు 77 మంది, ఫార్మసిస్టులు 76 మంది స్టాఫ్ నర్సులు 139 మంది ఉన్నారని, వీరందరి రెగ్యులర్ చేయాలని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూప రింటెండెంట్, వైద్యవిధాన పరిషత్ డీసీహెచ్‌ను కోరారు. దీనిపై స్పందించిన అధికారులు ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీవీవీపీ నుంచి జబీన్, కిరణ్, కర్నూలు జీజీహెచ్ నుంచి మురళి, నరేంద్ర, రవి, శివ, కిరణ్‌కుమార్, పీహెచ్‌సీల నుంచి వినోద్, సాంబశివుడు, వెంకటేశ్, సర్వేష్, శంకుతల పాల్గొన్నారు.

పది పరీక్ష కేంద్రాల పరిశీలన

సి.బెళగల్, మార్చి 19: మండలంలోని కొత్తకోటలోని రెండు పరీక్ష కేంద్రాలను ఎంపీడీవో శకుంతల మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్దకు విద్యార్థుల తల్లిదండ్రులను రానివ్వకుండా చూడాలని పోలీసులకు సూచించారు. అలాగే విద్యార్థులకు తాగునీరు అందించాలన్నారు.

బైక్‌లు ఢీకొని.. ఇద్దరికి తీవ్ర గాయాలు

ఓర్వకల్లు, మార్చి 19: మండలంలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై కాల్వబుగ్గ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా మంగళవారం రాత్రి బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వెల్దుర్తి మండలం ఎంబాయి గ్రామానికి చెందిన మద్దయ్య, ఉల్లిందకొండ మండ లం నాయకల్లు గ్రామానికి చెందిన హరిక్రిష్ణ బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో వీరికి తీవ్ర గాయాలు కాగా, కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. క్షతగా త్రులు ఎన్.కొంతలపాడు గ్రామంలో జరుగుతున్న ఉత్సవాలకు వస్తున్న సందర్భంగా ఈ సంఘటన చోటు చేసుకుంది. ఈ రెండు బైకులు ప్రమాదంలో నుజ్జునుజయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బీఈడీ కళాశాలల్లో గుర్తింపు లోపాలుంటే సరిచేసుకోండి

ఆర్‌యూ ఉపకులపతి సుధీర్ ప్రేమ్‌కుమార్

కర్నూలు(అర్బన్), మార్చి 19: బీఈడీ కళాశాలల్లో గుర్తింపు లోపాలుంటే సరిచేసుకోవాలని ఆర్‌యూ ఉపకులపతి బీ.సుధీర్ ప్రేమ్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీలోని సెనేట్ హాలులో బీఈడీ కళాశాలల సమావేశంలో కరస్పాండెంట్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుబంధంగా ఉన్న బీఈడీ కళాశాలలను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఒకే ప్రాంగణంలో ఒకటికి మించి కళాశాలలను నిర్వహిస్తున్నట్లైతే అందుకు సంబంధించిన భవనాలతో సహ వివిధ విభాగాలను స్పష్టంగా విభజించి చూపించాలన్నారు. కళాశాలలో తరగతి గదులు, ల్యాబ్‌లు, గ్రంథాలయాలు, ఆటస్థలాలు ప్రభుత్వ నియమాలకు అనుగు ణంగా ఉండాలన్నారు. విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు సంబంధించి ఆంధ్ర, ఆచార్య నాగార్జున, శ్రీవెంకటేశ్వర తదితర విశ్వవిద్యాలయాలు అనుసరిస్తున్న విధానాలను అధ్యయ నం చేసి అందుకు అనుగుణంగా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో రెక్టార్ నాయక్, రిజిస్ట్రార్ అంకన్న, డీన్‌లు, పరీక్షల విభాగం కంట్రోలర్, ఉమ్మడి జిల్లాల బీఈడీ కళాశాలల కరస్పాండెంట్లు హాజరయ్యారు.



మాట్లాడుతున్న ఉపకులపతి సుధీర్ ప్రేమ్‌కుమార్

ఏపీఈఆర్సీ బిల్డింగ్ పనుల పరిశీలన

కల్లూరు, మార్చి 19: కర్నూలు నగరంలో దిన్నెదేవరపాడు సమీపంలో కార్బైడ్ ఫ్యాక్టరీ వద్ద నిర్మాణంలో ఉన్న ఏపీఈఆర్సీ హెడ్‌క్వార్టర్స్ భవన నిర్మాణ పనులను చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి పరిశీలించారు. మంగళవారం కర్నూలు నగరానికి విచ్చేసిన ఆయన ఏపీఈఆర్సీ పనుల పురోగతిని పరిశీలిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గడువులోగా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి, సివిల్‌వర్క్ ఎస్ఈ విజయభాస్కర్, సివిల్ డీఈ శ్రీనివా సులు, అధికారులు ఉన్నారు.

గిరిజనుల హక్కుల సాధన కోసం ఉద్యమిద్దాం

కర్నూలు(అర్బన్), మార్చి 19: గిరిజనుల హక్కుల సాధన కోసం ఉద్యమించాలని గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని సూరజ్ గ్రాండ్ హోటల్‌లో గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర, జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కర్నూలు పార్లమెంట్ అధ్యక్షుడిగా పత్తికొండ నియోజకవర్గానికి చెందిన వై.రామాంజనేయులు (ఎరుకల కమ్యూనిటీ), ఉపాధ్యక్షుడిగా వై.హరిలకు కండువా కప్పి కమిటీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వెలుగోడు మండల అధ్యక్షుడు స్వామి నాయక్, హరికృష్ణ, కటారి కృష్ణ పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోకు అభినందన

కర్నూలు(హాస్పిటల్), మార్చి 19: జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్‌కు కర్నూలు జీజీహెచ్ ఉద్యోగులు మంగళవారం అభినందనలు తెలిపారు. డీఎంహెచ్‌వోను కలిసిన వారిలో ఆఫీస్ సూపరింటెండెంట్ కుమారస్వామి, ఆస్పత్రి ఉద్యోగులు సంజీవ్,మణి మోహన్, సి.బెళగల్ వైద్యాధికారి డా.రఘు, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్ ఉన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

రన్ ఫర్ జీసస్ టీ షర్టుల ఆవిష్కరణ

కర్నూలు(స్పోర్ట్స్), మార్చి 19: ఈఎస్‌టీ, సిటీ పాస్టర్స్, స్థానిక సంఘాలతో నిర్వహిస్తున్న రన్ ఫర్ జీసస్ టీషర్టుల ఆవిష్కరణ కార్యక్రమాన్ని కోల్స్ చర్చి ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా చైర్మన్ ఆర్‌ఆర్‌డీ సజీవరాజు, సీసీ సంఘం అధ్యక్షుడు ఏడీఏ లింకన్ పాల్గొని ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 30న రన్ ఫర్ జీసస్ ఉంటుందన్నారు. కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు సంఘకాపరులు ఆర్.అనిల్ సామేల్, ఎస్‌జే జీవన్, కన్వీనర్ దాసరి సుధీర్‌లు మాట్లాడుతూ ఈ రన్ ఫర్ జీసస్ రాక్‌వుడ్ చర్చి దగ్గర ప్రారంభమై సీ.క్యాంపు ప్రార్థన మందిరం వద్ద ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో సిటీ పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు శాలేంరాజు, సీసీ సంఘం సండే స్కూల్ సూపరింటెండెంట్ దేవరాజు, రన్‌ఫర్ జీసస్ సెక్రటరీ జయకర్, ట్రెజరర్ సురేష్, ఈఎస్‌టీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కర్రెమ్మ దేవర

సి.బెళగల్, మార్చి 19: మండలంలోని ముడుమాల గ్రామంలో మంగళవారం కర్రెమ్మ దేవరను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చి నెల మూడో వారం గ్రామ దేవత కర్రెమ్మకు గ్రామస్థులంతా మొక్కులు చెల్లించు కోవడం అనవాయితీగా వస్తుందన్నారు. దేవరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోడుమూరు సీఐ మన్సురుద్దీన్, ఎస్ఐ తిమ్మారెడ్డి పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

కాంగ్రెస్ సమన్వయ కమిటీ చైర్మన్‌గా అనంత రత్నం



డీసీసీ నుంచి నియామక పత్రం అందుకుంటున్న అనంత రత్నం

కర్నూలు(అర్బన్), మార్చి 19: కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ చైర్మన్‌గా అనంత రత్నం మాదిగను నియమించారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో డీసీసీ కే.బాబురావు నియామకపత్రం ఆయనకు అందజేశారు. ఈసందర్భంగా అనంతరత్నం మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన పదవికి న్యాయం చేస్తానన్నారు. ఎన్నికల్లో అభ్యర్థులందరినీ నియోజకవర్గాల వారీగా సమన్వయపరిచి అధిష్టానం నిర్ణయించిన అభ్యర్థికి మద్దతు తెలిపి, వారి గెలుపునకు కృషి చేస్తామన్నారు.

కాంగ్రెస్‌లోకి మాజీ జిల్లా అధికారి రామస్వామి



రామస్వామికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ పీసీసీ

కర్నూలు(అర్బన్), మార్చి 19: జిల్లా జాయింట్ కలెక్టర్, డీఆర్వో స్థాయిలో పనిచేసి పదవీ విరమణ పొందిన ఎస్.రామస్వామి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం అనంత పురం జిల్లాలో డీసీసీ కే.బాబురావు ఆధ్వర్యంలో మాజీ పీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ కార్యదర్శి శైలజానాథ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా రామస్వామి మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితుడనై పార్టీకి సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చారన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో ప్రజల్లో చైతన్యం తెచ్చి ప్రజల అభిమానం చూరగొన్నారని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలపడుతుందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ గౌరవా ధ్యక్షుడు ఉండవల్లి వెంకటన్న, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బీ.బతుకన్న, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ గుప్త, అనంతరత్నం మాదిగ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్న సెబ్ పోలీసులు

కోడుమూరు/కోడుమూరు(రూరల్), మార్చి 19: కోడుమూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో స్టేషన్ పరిధిలో సి.బెళగల్ మండలంలోని బ్యాతోలీ, పోల్‌కల్ గ్రామాల మధ్యలో కర్ణాటక మద్యం తరలిస్తుండగా సెబ్ సీఐ రామాంజనేయులు మంగళవారం తెల్లవారుజామున దాడి చేసి పట్టుకొన్నారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు ఆయా గ్రామాల్లో దాడులు నిర్వహిం చగా మోటర్ సైకిల్ కర్ణాటక మద్యాన్ని ఒక వ్యక్తి తరలిస్తుండగా పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో బైక్‌పై ఉన్న గుర్తు తెలియని వ్యక్తి పరార్ అవ్వగా పోలీసులు బైక్, 9 కేసుల కర్ణాటక మద్యం సీసాలను స్వాధీనం చేసుకొన్నారు. పరారీలో ఉన్న వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని, త్వరలోనే నిందితుడిని పట్టుకొంటామని సీఐ రామాంజనేయులు తెలిపారు. ఈ దాడిలో సెబ్ పోలీసులు అలీబేగ్, హనుమంతు, విరుపాక్షిరెడ్డి, వెంకటేశ్‌నాయక్, అన్సర్‌బాషా పాల్గొన్నారు.

యాగంటీశ్వరుడికి పూజలు

ఓర్వకల్లు, మార్చి 19: మండలంలోని ఎన్.కొంతలపాడులో యాగంటీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డిలు స్వామివారికి పూజలు నిర్వహించారు. యాగంటీశ్వరుడికి కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కర్నూలు బుధవారపేటకు చెందిన అంబిలి పాపయ్య, నాగమ్మ జ్ఞాపకార్థం కుమారులు అంబిలి చంద్రమౌళి, అమర్‌నాథ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని గౌరు వెంకటరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, ఆలయ ఈవో మద్దిలేటి, సర్పంచులు మధుకేశన్న, నాయకులు సుధాకర్‌రావు, లక్ష్మీకాంతరెడ్డి, నాగతిరుపాలు, పెరుగు పురుషోత్తంరెడ్డి, శ్రీనివాసులు, రామకోటేశ్వరరావు, మధుసూదన్‌గౌడు, చంద్రశేఖరప్ప, మల్లికార్జునప్ప, జగదీశ్వర్ గౌడు, ఎల్లా స్వామి, మద్దయ్య పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న గౌరు వెంకటరెడ్డి, నాయకులు

కేంద్ర సాయుధ బలగాల కవాతు

కర్నూలు, మార్చి 19: ప్రశాంతంగా సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి జిల్లాలోని పలు ప్రాంతాల్లో పోలీసులు మంగళవారం కవాతు నిర్వహించారు. ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు జిల్లాలోని కర్నూలు, ఆదోని సబ్ డివిజన్‌లోలని పలు ప్రాంతాల్లో కేంద్ర సాయుధ బలగాలైన సశస్త్ర సీమా బల్ సిబ్బందితో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు. నగరం లోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అంబేద్కర్ విగ్రహం, ఓల్డ్‌టౌన్, హెడ్ పోస్టాఫీస్, పాత కంట్రోల్ రూమ్, కిడ్స్ వరల్డ్, రాజ్ విహార్, బంగారుపేట, ఆర్ఎస్ రోడ్డు, ఎస్‌బీఐ సర్కిల్, ఇన్‌కమ్ ట్యాక్స ఆఫీసు మీదుగా తిరిగి పోలీస్ స్టేషన్ వరకు కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. అలాగే త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీ.క్యాంపు, కర్నూలు మెడికల్ కాలేజీ బుధవారపేట ప్రాంతాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ ఇంతియాజ్‌బాషా, త్రీటౌన్ సీఐ మురళీధర్ రెడ్డి, ఎస్ ఐలు వెంకట సురేష్, సిద్దయ్య, పోలీసులు పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలు, పోలీసులు

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

క్రిష్ణగిరి ఎస్ఐని సస్పెండ్ చేయాలి : సీపీఐ

పత్తికొండ టౌన్, మార్చి 19: అధికార పార్టీకి తొత్తుగా మారిన క్రిష్ణగిరి ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డిని సస్పెండ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీఆర్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికార పార్టీ, ఎమ్మెల్యేకు తొత్తుగా మారిన క్రిష్ణగిరి ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తూ గ్రామాల్లో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామానికి చెందిన చాకలి నరసింహుడు సీపీఐలో ఉన్నాడనే నెపంతో ఇంటికి పిలిపించుకుని వైసీపీలో చేరాలని అధికార పార్టీకి చెందిన నాయకులు విచక్షణారాహితంగా కొట్టి గాయపరిచారన్నారు. తనపై దాడి చేసి గాయపర్చిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే క్రిష్ణగిరి ఎస్ఐ ఏకపక్షంగా వ్యవహరిస్తూ బాధితులను బూతులు తిడుతూ దురుసుగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేకు, అధికార పార్టీకి అనుకూలంగా ఉండేందుకు ఎస్ఐని ప్రత్యేకంగా ఇక్కడే పోస్టింగ్ వేయించుకున్నారన్నారు. అధికార పార్టీ నాయకుల మెప్పు పొందేందుకు అమాయకప్రజలపై ఎస్ఐ చెలరేగిపోతున్నారని, ఉన్నతాధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో క్రిష్ణగిరి మండల కార్యదర్శి ఖలీల్, బొంతిరాళ్ల సర్పంచ్ న్యాయవాది రవిమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో సచివాలయం వద్ద నిరసన

దేవనకొండ ,మార్చి 19 : నెలరోజులు నుంచి తాగు నీరు రాకపోవడంతో ఖాళీ బిందెలతో తెర్నేకల్ 2 సచివాలయం వద్ద గ్రామస్తులు నిరసన చేపట్టారు. మంగళవారం మండలంలోని తెర్నేకల్ గ్రామంలో నాయిబ్రహ్మణ వీధి ఎల్లమ్మపేట కాలనీల మహిళలు సచివాయలం వద్దకు చేరుకొని నిరసన తెలిపారు. అధికారులు నీటి సమస్య పరిష్కరిస్తామని ఇచ్చిన హామీతో నిరసన విరమించారు.

కప్పట్రాళ్లలో డెంగీ కేసు

దేవనకొండ ,మార్చి 19 : మండలంలోని కప్పట్రాళ్లలో ఆరేళ్ల బాలుడు డెంగీ బారీన పడ్డాడు. కప్పట్రాళ్ల కురువ గేరి చెందిన భరత్ అనే బాలుడికి మూడు రోజులుగా జ్వరం ఉండడంతో కర్నూలు వైద్యశాలలో చేర్పించారు. బాలుడికి డెంగీ జ్వరం వచ్చినట్లు వైద్యులు గుర్తించారని మలేరియా అధికారి సాయిబాబా తెలిపారు. సూపర్‌వైజరు రంగస్వామి పంచాయతీ కార్యదర్శి సుంకన్నలు దోమలు ప్రభలకుండా పలు చర్యలు చేపట్టారు. గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణ లోపంతో డెంగీ కేసులు పెరిగిపోతున్నాయి. పంచాయతీల్లో నిధులు లేక నిర్వహణ చేపట్టకపోవడంతో విష జ్వరాల బారిన పడుతున్నారని అయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సారూ... ఇటు చూడరూ!

హొళగుంద, మార్చి 18 : దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ కోడ్ అమలులోకి వచ్చింది. 24 గంటల్లో ఫ్లెక్సీలు, రాజకీయ నాయకుల ఫొటోలు



వాల్మీకి సర్కిల్లో వైసీపీ వాల్‌పోస్టర్లు

తొలగించాలని ఆదేశించి 72 గంటలు పూర్తి అయినా, అధికారులు మత్తు నిద్ర వదలడం లేదు. హొళగుందలోని వాల్మీకి సర్కిల్లోని ఓ దుకాణం వద్ద ఆలూరు నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుసినే విరుపాక్షి, ముఖ్యమంత్రి జగన్ ఫొటో కనిపిస్తున్న వాల్‌పోస్టర్ దర్శనం కనిపిస్తోంది. అధికారులు ఈ పోస్టర్లను తొలగించాల్సి ఉంది.

టీడీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరు







ఎమ్మిగనూరు పట్టణంలోని శివన్ననగర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి, మంత్రాలయం అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరిక, హోసూరులో కేఈ శ్యాంబాబు ప్రచారం

- జిల్లా వ్యాప్తంగా టీడీపీ అభ్యర్థుల విస్తృత ప్రచారం
- చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం : బీవీ
- ఎన్నికలపోరుకు సిద్ధమవుదాం
- హోసూరులో కేఈ శ్యాంబాబు ప్రచారం
- వైసీపీ నుంచి మూగలదొడ్డి వాసులు టీడీపీలో చేరిక
- సాధరంగా ఆహ్వానించిన మంత్రాలయం టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి

రాష్ట్రంలో టీడీపీ కూటమి విజయాన్ని ఎవరూ ఆపలేరని తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఎమ్మిగనూరు టౌన్, పత్తికొండ మండలం హోసూరు, మంత్రాలయం మండలంలో టీడీపీ అభ్యర్థులు విస్తృత ంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఎమ్మిగనూరు, మార్చి 19: పట్టణంలోని 5వ వార్డులో టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. శివన్న నగర్ ప్రాంతంలో మాజీ కౌన్సిలర్ రంగస్వామి గౌడ్ ఆధ్వర్యంలో మహిళా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఎమ్మిగనూరు ప్రాంతంలోని చేనేతలకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో గతంలో టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబును ఒప్పించి టెక్స్‌టైల్ పార్కుకోసం వంద ఎకరాలు స్థలం కేటాయించామని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకుండా చేనేతలను నిర్లక్ష్యం చేసి ఆ స్థలంలో ఇళ్లస్థలాలు కేటాయించిందన్నారు. ఎన్నడూ చేనేతల గురించి ఆలోచించని వారు ఇప్పుడు అన్ని చేస్తామంటూ మభ్యపెడుతున్నారని, వారి మాటలు నమ్మొద్దన్నారు. ఐదేళ్లలో మీ ప్రాంతంలో సమస్యలు ఏమైన తీర్చారా.. కనీసం సమస్యలను పరిశీలించేందుకైనా వచ్చారా.. ఆలోచించాలని కోరారు. చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని స్పష్టం చేశారు. టీడీపీకి మాత్రమే అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసే సత్తా ఉందన్నారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతొ గెలిపించాలని కోరారు. నాయకులు కొండయ్య చౌదరి, రామదాసు గౌడ్, ముల్లా కలీముల్లా, దయాసాగర్, రామకృష్ణ నాయుడు, సుందరరాజు, చేనేత మల్లి, మిన్నప్ప, జయన్న, కటారి రాజేంద్ర, సోమన్న, కృష్ణతేజనాయుడు, అంబేడ్కర్, ఈరన్న, కృష్ణలు పాల్గొన్నారు.

ఎన్నికలపోరుకు సిద్ధమవుదాం : కేఈ

పత్తికొండ : ఎన్నికల పోరుకు ప్రతికార్యకర్త సిద్ధంకావాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు అన్నారు. మంగళవారం పత్తికొండ మండల పరిధిలోని పులికొండ రంగనాథస్వామిదేవాలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అరాచక వైసీపీ పాలనకు అంతంతప్పదని, వచ్చే ఎన్నికలలో టీడీపీ కూటమి అధికారం చేపట్టడం ఖాయమని స్పష్టం చేశారు. వైసీపీ అరాచకాలపై ప్రస్తుతం రాష్ట్రంఉన్న పరిస్థితులలో చంద్రబాబు నాయకత్వం ఎంత అవసరమో క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం పట్టణంలోని పలుదేవాయాల్లో పూజలు నిర్వహించిన ఆయన సాయంత్రం హోసూరుగ్రామంలో బాబుష్యూరిటీ భవిష్యత్ కార్యక్రమంలో ప్రజలను కలసిమాట్లాడారు.

వైసీపీ నుంచి 20 కుటుంబాలు టీడీపీలో చేరిక

మంత్రాలయం: కోసిగి మండలంలోని మూగలదొడ్డి గ్రామానికి చెందిన 20 వైసీపీ కుటుంబాల వారు టీడీపీ తీర్థం తీసుకున్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి వారికి పార్టీ కండువా వేసి సాధరంగా ఆహ్వానించారు. ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సమిష్టిగా పోరాటం చేసి టీడీపీని గెలిపించాలని ఆయన కోరారు. బీసీలకు టీడీపీ అధిక ప్రాధాన్యత ఇస్తుందని, మంత్రాలయం అభివృద్ధి చెందాలంటే టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గుడిసె రాఘవేంద్ర, గొల్ల హుశేనీ, నాగేంద్ర, బాషా, వీరేష్, వీరన్న, కురువ శంకర్, సుంకయ్య, గుడిసె వెంకటేశ్, రాజన్న, లక్ష్మీకాంత్, ఈరన్న, వగరూరు వీరారెడ్డి, మద్దిలేటి, నరసింహులు, నరసన్న, రమేష్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయంలో విజయం తథ్యం : మంత్రాలయంలో టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి తప్పకుండా విజయం సాధిస్తారని ఎమ్మెల్యే అభ్యర్థి సోదరుడు రామక్రిష్ణారెడ్డి అన్నారు. మాలపల్లి, సింగరాజుపల్లి, పెద్దకడుబూరు మండలం నాగులాపురం గ్రామాల్లో పర్యటించి టీడీపీ నాయకులను కలుసుకుని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు ఎస్ఎం గోపాల్‌రెడ్డి, గువ్వల భీమన్న, మాలపల్లి చంద్ర, లక్ష్మన్న, వీరేష్, లక్ష్మి, రత్నం, ఏసేపు, తిక్కన్న, జగన్నాథ్, మారెన్న, హనుమంతు, నరసింహ, హనుమయ్య, పెద్ద ఈరన్న, బసప్ప, హుశేనీ, తదితరులు పాల్గొన్నారు. అలాగే జనసేన కౌతాళం మండల అధ్యక్షుడు రామాంజులుతో పాటు జనసేన కార్యకర్తలు పెద్ద ఎత్తున రాఘవేంద్రరెడ్డిని కలిసి శాలువ, పూలమాలతో సన్మానించారు.

టీడీపీ శ్రేణులతో తిక్కారెడ్డి సమావేశం

మంత్రాలయం, మార్చి 19: రాష్ట్రంలో ఉమ్మడిగా పోటీ చేసి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం సాధించడం తథ్యమని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మండలంలోని రచ్చుమర్రి, చిలకలడోన, కౌతాళం మండలం హాల్వి, వల్లూరు, కోసిగి మండలం నుంచి చింతకుంట, పెద్దభూంపల్లి, మూగలదొడ్డి గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాల సేకరణ చేపట్టారు. నియోజకవర్గంలోని టీడీపీ కార్యకర్తలంతా ధైర్యంగా ఉండాలని, టీడీపీ అదిష్ఠానం పునరాలోచిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో టీడీపీ మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్ స్వామి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేశ్, మంత్రాలయం బీసీ నియోజకవర్గ అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి, ఎల్లారెడ్డి, విజయరామిరెడ్డి, అశోక్ రెడ్డి, పవన్, యేబు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ కార్యకర్తలతో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు

తుగ్గలి, మార్చి 19: పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే డిబార్ చేస్తామని సిట్టింగ్ స్క్వాడ్ రామాంజనేయులు హెచ్చరించారు. మంగళవారం సెకండ్ లాంగ్వేజ్ హిందీ పరీక్షకు మండల కేంద్రం తుగ్గలి నోవీ, జడ్పీహెచ్ఎస్ పాఠశాల పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. పరీక్షలు పూర్తయ్యేంత వరకు నోవీ పాఠశాలలోనే ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో పరీక్షలు రాయాలని, అప్పుడే భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. ఈయన వెంట ఎంఈవో రమావెంకటేశ్‌గౌడు తదితరులు ఉన్నారు.

ఎన్నికల కోడ్‌ను పాటించండి

మద్దికెర, మార్చి 19: మండలంలోని అన్ని శాఖల అధికారులు ఎన్నికల కోడ్‌ను తప్పనిసరిగా పాటించాలని తహసీల్దార్ రజాక్‌వలి అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారుల సమావేశం జరిగింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆయా గ్రామాల్లోని రాజకీయ పార్టీల నాయకులు, ఫొటోలు, ఫ్లెక్సీలు తొలగించాలని ఆదేశించారు. సమావేశంలో వీఆర్వోలు ఉన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

మద్దికెర, మార్చి 19: మండలంలో ఏ గ్రామంలోనైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రమేష్‌బాబు హెచ్చరించారు. మంగళవారం ఎం.అగ్రహారం, మద్దికెర, ఆయా గ్రామాల్లోని పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బహిరంగ ప్రదేశాల్లో ఎవరూ మద్యం సేవించరాదని, అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటి ఆరుగురిపై డ్రైండోవర్ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శంకర్, ఫణిరాజు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

హైదరాబాద్‌కు తరలివెళ్లిన టీడీపీ నాయకులు

దేవనకొండ ,మార్చి 19 : ఆలూరు అసెంబ్లీ టీడీపీ స్థానం కోట్ల సుజాతమ్మకు కేటాయించాలని టీడీపీ మండల నాయకులు మంగళవారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఐదేళ్లుగా నియోజకవర్గంలో కార్యకర్తల శ్రేయోస్సుకోసం కష్టపడ్డారని, ఆలూరు స్థానం సుజాతమ్మకు కేటాయించేలా అధినేత చంద్రబాబును కోరతామని పేర్కొన్నారు.

లాయర్ల సంఘం ఎన్నికల నామినేషన్లు పూర్తి

పత్తికొండ , మార్చి 19 : పత్తికొండ న్యాయవాదుల నూతనకమిటీ ఎన్నికల నామినేషన్ల కార్యక్రమా పూర్తయిందని ఎన్నికల అధికారి మైరాముడు తెలిపారు. నూతన కమిటికి సంబంధించి రెండురోజులపాటు నామినేషన్లు స్వీకరించిమని అధ్యక్షపదవికి ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు వేయగా మిగిలిన వాటికి మరో నలుగురు నామినేషన్లు వేశారని పేర్కొన్నారు. ఈ నెల 25న ఎన్నికలు ఉంటాయని తెలిపారు. ఎన్నికలసహాయ అధికారులు మధుబాబు, ప్రసాద్ ఉన్నారు.

నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలి

- సబ్ కలెక్టర్, ఎన్నికల అధికారి శివనారాయణ శర్మ

ఆదోని, మార్చి 18 : ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ అన్నారు. మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ ఛాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై అధికారులు తీసుకుంటున్న చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. శివనారాయణ శర్మ మాట్లాడుతూ ఆదోని నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాలు ఉండగా 26 రూట్ ఆఫీసర్లు, సెక్టరల్ ఆఫీసర్లు నియమించామన్నారు. నియోజకవర్గంలో 2,57,529 మంది ఓటర్లు ఉన్నారని, పురుషులు 1,27,798 మంది ఉండగా, మహిళలు, 1,29,682 కాగా థర్డ్ జెండర్ 49 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 26 రూట్ ఆఫీసర్లు, నలుగురు నోడల్ ఆఫీసర్స్‌ని నియమించామని, అర్బన్ 14, రూరల్ 12 ఉండగా, అర్బన్‌లో నోడల్ ఆఫీసర్స్‌గా మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. రూరల్ ఎంపీడీవో, ఈఆర్‌డీనూ నోడల్ ఆఫీసర్లుగా నియమించడం జరిగిందన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) అమలును పటిష్టంగా అమలు చేస్తున్నామని, ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా సంబంధిత అధికారులను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. సీవిజిల్ యాప్‌కు ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, మరింత బలోపేతం చేసి యాప్ నుంచి వచ్చే ఫిర్యాదులను 100 నిమిషాలలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. అన్ని గ్రామ పంచాయతీలు, సచివాలయాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలపై ఉన్న రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్లు, పోస్టర్లు, స్టిక్కర్లు, ఫొటోలను, ఇతర క్యాలెండర్లు, జెండాలను, బస్టాండ్, రైల్వే స్టేషన్లలో, రోడ్డు కిరువైపులా, ముఖ్య కూడలి ప్రాంతాల్లోని అన్ని హోర్డింగులను అధికారులు, సంబంధిత వీర్వోలు, ఎంపీడీవోలతో మాట్లాడి తొలగించామని అన్నారు. ఎన్నికల ఖర్చులపై రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై ఎన్నికల వ్యయా అంచనా అధికారులతో కలిసి సబ్ కలెక్టర్ నివృత్తి చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అసెంబ్లీ ఎన్నికలో పోటీ చేసే ప్రతి ఒక అభ్యర్థికి రూ.40 లక్షల వరకు ఖర్చు చేయవచ్చు అన్నారు. ప్రతి ఒక్క ఖర్చుపై ఆడిటింగ్, మానిటరింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. తహసీల్దార్ హసీనా సుల్తానా, మునిసిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ రామేశ్వర రెడ్డి, ఎంపీడీవో విజయ్ శేఖర్ రావు, డీఎల్‌పీవో కార్యాలయపు పరిపాలన అధికారి వీరభద్రప్ప, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఆల్ ఇండియా సెపక్ తక్రా పోటీలు

- పంజాబ్ యూనివర్సిటీ విజయం
- రేగు ఈవెంట్ పటియాల జట్టు మొదటి స్థానం

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 18 : ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్రీడామైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలు మూడవ రోజు పలు యూనివర్సిటీ జట్ల మధ్య హోరాహోరీగా సాగింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లను కరస్పాండెంట్ దైవాదీనం రెడ్డి పరిచయం చేసుకుని ప్రారంభించారు. క్వాడ్రెంట్ ఈవెంట్ పోటీలలో 15 మ్యాచ్‌లు జరుగగా, అందులో ఉత్కల్ యూనివర్సిటీ జట్టుపై గోండ్వానా యూనివర్సిటీ విజయం సాధించింది. మౌలానా ఆజాద్ జోధ్‌పూర్ యూనివర్సిటి జట్టుపై ఉస్మానియా యూనివర్సిటీ జట్టు విజయం సాధించగా, తెలంగాణ యూనివర్సిటీ నిజామాబాద్ జట్టు పై ఏపీజే అబ్దుల్ కలాం యూనివర్సిటి విజయం సాధించింది. యూనివర్సిటీ జట్టు పై నాగార్జున విశ్వవిద్యాలయం జట్టు విజయం సాధించి తదుపరి రౌండ్‌కు అర్హత సాధించింది. నాకౌట్ మ్యాచ్‌లో మొదటి స్థానంలో పంజాబ్ యూనివర్సిటీ ఆఫ్ చండీఘర్ జట్టు, రెండవ స్థానంలో పంజాబ్ యూనివర్సిటీ పాట్యాల జట్టు, మూడవ స్థానంలో యూనివర్సిటీ ఆఫ్ కాలికట్ జట్టుతో పాటు రాయలసీమ విశ్వవిద్యాలయం జట్టు సంయుక్తంగా విజేతలుగా ప్రకటించారు. రేగు టీం ఈవెంట్‌లో పంజాబ్ యూనివర్సిటీ పట్యాలా జట్టు మొదటి స్థానంలో నిలువగా, చండీఘర్ పంజాబ్ యూనివర్సిటీ రెండవ స్థానం యూనివర్సిటీతో పాటు యూనివర్సిటీ ఆఫ్ కాలికట్ సంయుక్తంగా మూడవ స్థానంలో నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సభ్యులు ప్రశాంత్ గాంధీ, వైస్ ప్రెసిడెంట్ సురేష్, ఎర్రిస్వామి, కమిటీ ఆర్‌యూ ఫిజికల్ డైరెక్టర్లు శివకిషోర్, ముత్తయ్య, కళ్యాణ్ కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



తలపడుతున్న జట్లు

జాబు కావాలంటే.. బాబు రావాలి

మద్దికెర, మార్చి 19: నిరుద్యోగ యువతకు జాబు కావాలంటే.. బాబు రావాలని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు ఆనంద్ కుమార్, సోషల్ మీడియా కన్వీనర్ హుశేన్‌పీరా అన్నారు. మంగళవారం మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ రెడ్డి పాలనలో నిరుపేదల సంఖ్య రోజురోజుకు పెరిగిపోయిందన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

అక్రమ కర్ణాటక మద్యం స్వాధీనం

కోసిగి, మార్చి 19: మండల పరిధిలోని తుంగభద్ర నది తీరానా తుమ్మిగనూరు గ్రామ సమీపంలో కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న పది బాక్సుల అక్రమ కర్ణాటక మద్యంతో పాటు ఒక ద్వీచక్రవాహనం, స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెబ్ సీఐ మహబూబ్‌బాషా ఆదేశాల మేరకు తనిఖీల్లో భాగంగా తుమ్మిగనూరు సమీపంలో తుంగభద్ర నది నుంచి అక్రమంగా తరలిస్తున్న 10 బాక్సుల కర్ణాటక మద్యంతో పాటు హీరో ప్యాసన్‌ప్రో బైక్‌ను స్వాధీనం చేసుకుని కర్ణాటకలోని రాయచూరు జిల్లా కటకనూరు గ్రామానికి చెందిన రామలింగ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఈ తనిఖీల్లో సెబ్ పోలీసులు రాముడు, నాగరాజు, మధు, నాగరాజు, శ్రావణ్ పాల్గొన్నారు.



పట్టుబడిన కర్ణాటక మద్యం చూపుతున్న సెబ్ ఎస్ఐ రమేష్‌బాబు

ఆలూరు : వాహనాలు తనిఖీ చేస్తుండగా కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని తరలిస్తుండగా ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఓబులేషు మంగళవారం తెలిపారు. మాచనూరు గ్రామానికి చెందిన ఎర్రగుడి సూరి, ఆలూరుకు చెందిన దళవాయి విజయ్ అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. వీరి నుంచి పది బాక్సుల కర్ణాటక మద్యంతో పాటు రెండు మోటర్ సైకిళ్లను సీజ్ చేసినట్లు తెలిపారు.

రంగు పడింది !

- సీఎం జగన్ బొమ్మలను తొలగించారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆదోని రూరల్, మార్చి 19: దేశ వ్యాప్తంగా గడిచిన శనివారం మధ్యాహ్నం 3గంటలకు ఎన్నికల కోడ్ వచ్చిన సంగతి తెలిసిందే. ఎన్నికల కమిషన్ ఆదేశాలను బేఖాతారు చేస్తూ, ఆదోని పట్టణం, రూరల్ పరిధిలో సచివాలయాలకు వైసీపీ రంగులు, బొమ్మలు ఉండడంతో ఆంధ్రజ్యోతి మంగళవారం కోడ్ కోసినా మేల్కోరా అన్న కథనాన్ని ప్రచురించిన విషయం పాఠకులకు విదితమే. స్పందించిన ఇన్‌చార్జి ఎంపీడీఓ శేఖర్, సిబ్బందితో కలిసి తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంపై ఉన్న రాజశేఖరరెడ్డి, జగన్ బొమ్మలపై స్టిక్కర్లు అతికించారు. అలసందగుత్తిలో పలు చోట్ల ఉన్న జగనన్న నువ్వే మా నమ్మకం స్టిక్కర్లుకూడ తొలగించినట్లు ఎంపిడిఓ తెలిపారు. అలాగే ఆదోని నడిబొడ్డున ఉన్న వార్డు సచివాలయానికి కూడ సంబంధిత అధికారులు రంగులు వేశారు.



వాహనంపైన ఉన్న జగన్ బొమ్మపై రంగు వేస్తున్న అధికారులు

సంక్షిప్త సమాచారం

పంచాయతీ వేలాలు వాయిదా

పత్తికొండ , మార్చి 19 : ప్రతిఏటా గ్రామపంచాయతీ నిర్వహించే బస్టాండ్‌పార్కింగ్, కూరగాయల మార్కెట్, మాంసం మార్కెట్ వేలాలు ఎన్నికల కోడ్ నేపథ్యంలో తాత్కాలికంగా వాయిదా వేశామని ఈవో నరసింహులు తెలిపారు. గత ఏడాది కేటాయించిన సమయం ప్రకారం బుధవారం వేలాలు నిర్వహణ చేయాల్సిఉందన్నారు. కోడ్‌తర్వాత వేలాలు యథావిధిగానిర్వహిస్తామని వేలపాట దారులు గమనించాలని కోరారు.

ప్రారంభమైన కామన్న వేడుకలు

హొళగుంద, మార్చి 18 : స్థానిక ఉరవకొండ మఠంలో హోలి పండుగ సందర్భంగా స్థానిక యువకులు కామన్న వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో భాగంగా మొదటి రోజు మగవారు చీర కట్టులో కుంభాలతో.. దున్నపోతును బలిచ్చేందుకు తీసుకెళ్లే హాస్యదృశ్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఇలా హాస్యనాటిక వారం రోజులపాటు ప్రతిరోజూ ప్రజలను అలరిస్తామని, అనంతరం హోలి పండుగ ఉంటుందని హాస్య కళాబృందం సభ్యుడు బేకరీ వీరేష్ తెలిపారు.

నేడే బసవేశ్వరస్వామి రథోత్సవం..

కోసిగి, మార్చి 19: జంపాపురం గ్రామంలోని బసవేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు, గ్రామ పెద్దలు తెలిపారు. మంగళవారం ఉదయం నుంచే ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచే కుంకుమార్చన, ప్రత్యేక పుష్పాలంకరణ, మంగళహారతి నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

నీటి సమస్యను పరిష్కరించండి

ఎమ్మిగనూరు రూరల్, 19: కలుగొట్ల గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ డివిజన్ ప్రధాన కార్యదర్శి బాలరాజు కోరారు. మంగళవారం ఎంపీడీవో కొండన్నను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. గ్రామంలో నీరు సరఫరా అయిన సమయంలో కొంతమంది కుళాయిలకు మోటారులు వేస్తుండడంతో సగం మందికిపైగా తాగునీరు అందడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

ఆదోని రూరల్, మార్చి 19 : సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. మంగళవారం పెద్దతుంబళం ఎస్ఐ వీరయ్య సిబ్బందితో కలిసి రూరల్ సీఐ నీరంజన్ రెడ్డి కోసిగి - పెద్దతుంబళం ప్రధాన రహదారిలో వాహనాల తనిఖీ చేపట్టారు. ప్రస్తుతం ఎన్నికల నిబంధనల ప్రకారం ఒక వ్యక్తితో రూ.50వేలకు మించి ఉండకూడదని, ఒకవేళ అధికమొత్తంలో డబ్బు ఉంటే పోలీసులు పట్టుపడిన క్రమంలో ఆ డబ్బుకు సంబంధించిన వివరాలు చూపాలని సూచించారు.